సాక్షి అనంతపురం

గురువారం । 24 । అక్టోబర్ । 2024



మృత్యువులోనూ వీడని స్నేహం

శింగనమల మండలం సోదనపల్లికి చెందిన స్నేహితులు రమణ, పేట నాగేశ్వరరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 8లో



టమాట కిలో రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.17, సరాసరిన రూ.30 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.7°/22.5°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

సహాయక చర్యలకు రూ. కోటి



అనంతపురం అర్బన్: జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. నిధుల వినియోగానికి సంబంధించి బిల్లులు 30 రోజుల్లో సమర్పించాలని పేర్కొంది. ఈ మేరకు ఉత్తర్వులను (జీఓ 69) జారీ చేసింది. వరద బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రక్షిత మంచినీరు అందించాలని, ఆహారం, పాలు వంటి సదుపాయం కల్పించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగుకు నిధులు వెచ్చించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలకు వరద బాధితులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల్లో కూలిన చెట్లను తొలగించాలని సూచించారు. ఇందుకు సంబంధించి బిల్లులను 30 రోజుల్లో సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రద్దు



గుంతకల్లు: దానా తుపాను ప్రభావంతో భువనేశ్వర్ నుంచి కేఎస్ఆర్ బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 18463)ను శుక్రవారం (ఈ నెల 25) ఒక్క రోజు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫేర్

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. జిల్లా సమన్వయ అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం సాగుతుందన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో 250 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

అక్కడక్కడా వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. బుధవారం పలు మండలాల్లో వాన కురిసింది. గుంతకల్లు, పామిడి, గుత్తి, గార్లదిన్నెలో 20 మి.మీ, బుక్కరాయసముద్రం, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు 15 మి.మీ వర్షపాతం నమోదైంది. కణేకల్లు, యాడికి, తాడిపత్రి, పుట్లూరు, బెళుగుప్ప, డి.హిరేహాళ్, అనంతపురం, కూడేరు, యల్లనూరు, రాయదుర్గం తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



టీబీ డ్యాం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన భారీ వర్షాల కారణంగా బుధవారం 1,10,759 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం అధికారులు 21 గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి 89,382 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. మరో 15,627 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 101.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

వెబ్‌సైట్‌లో ఏఎన్‌ఎంల సీనియారిటీ జాబితా

అనంతపురం మెడికల్: పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తూ గ్రేడ్–3 పదోన్నతులకు అర్హులైన ఏఎన్ఎంల సీనియారిటీ జాబితాను అనంతపురం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే తమకు తెలియజేయాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా అభ్యంతరాలు తెలపాలని కోరారు.

అమ్మేశారు.. ముంచేశారు!

- పండమేరు వంక పొరంబోకు స్థలాల్లో వెలసిన గుడిసెలు, నివాసాలు
- పేదల అవసరాలను ఆసరా చేసుకుని నకిలీ పట్టాలు సృష్టించిన అక్రమార్కులు
- ఒక్కో పట్టాకు రూ. 30 వేల నుంచి రూ. లక్ష దాకా వసూలు
- అక్రమార్కులు రెచ్చిపోవడానికి కారణం ఉన్నతాధికారుల అలసత్వమే!
- నీరు చేరితే రోడ్డు మీదకు పేదల బతుకులు
- నష్టాన్ని పూడ్చేదెవరు..? వారికి అండగా నిలిచేదెవరు..?
- ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే



పండమేరు వంక నీటి ముంపులో అనంతపురం శివారు కాలనీలు

రాప్తాడురూరల్: గాల్లో దీపం పెట్టి దేవుడి మీద భారం వేస్తే ఆయన మాత్రం ఎలా కాపాడతాడు?!. అచ్చు అలానే ఉంది పండమేరు వంకకు రెండు వైపులా ఆనుకుని ఉన్న కాలనీల పరిస్థితి. ఊహించని విధంగా పండమేరు వంకకు నీటి ఉధృతి పెరగడంతో చుట్టుపక్కల కాలనీలన్నీ జలమయం అయ్యాయి. వంక పొరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని గుడిసెలు, పక్కా ఇళ్లు నిర్మించుకోవడంతో ఎక్కువగా నష్టం వాటిల్లింది. అధికారులు ప్రారంభంలోనే గట్టి చర్యలు తీసుకుని ఉంటే ఈ రోజు ఇలాంటి దుస్థితి ఉండేదికాదు.

అమాయకత్వాన్ని 'క్యాష్' చేసుకున్నారు..

ఎట్టి పరిస్థితిలోనూ వంక పొరంబోకు స్థలాలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు వీలులేదు. అయితే, అక్రమాల్లో ఆరితేరిన వ్యక్తులు నకిలీ పట్టాలు సృష్టించారు. అది వంక పొరంబోకు స్థలం అని తెలిసీ, ఎప్పటికైనా పెద్ద వర్షం వస్తే ఇబ్బందులు తప్పవని తెలిసి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆ నకిలీ పట్టాలను వారికి కట్టబెట్టి భారీగా వసూలు చేశారు. ఒక్కో పట్టాకు రూ. 30 వేల నుంచి రూ. లక్ష దాకా వసూలు చేసినట్లు తెలుస్తోంది. వసూలు చేసిన వారు లక్షాధికారులయ్యారు.. వారిని నమ్ముకుని వంక స్థలాల్లో గుడిసెలు, ఇళ్లు కట్టుకున్న నిరుపేదల బతుకులు నేడు రోడ్డునపడ్డాయి. ఈ నష్టానికి బాధ్యులెవరు? నకిలీ పట్టాలిచ్చిన అక్రమార్కులా? వాటిని తొలగించకుండా కళ్లప్పగిస్తూ చూస్తున్న అధికారులా? ప్రారంభంలోనే అధికారులు గట్టి చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలు తొలగించి, నకిలీ పట్టాలిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈరోజు ఈ పరిస్థితి ఉండేది కాదు.

18 ఎకరాలకు పైగా ఆక్రమణ

అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పొలం 194, 214, 215 సర్వే నంబర్లలో 18 ఎకరాలకు పైగా ఆక్రమించారు. దాదాపు 1,700 దాకా గుడిసెలు వెలిశాయి. ఇందులో కొందరు పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. 18 ఎకరాల్లో 80 శాతం పైగా వంక పొరంబోకు స్థలమే. వంక పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల కారణంగానే సమీపంలో ఉన్న జగనన్నకాలనీకి నీటి ఉధృతి తాకింది. వాస్తవానికి ఈ కాలనీ వరకు నీళ్లు వచ్చే అవకాశం చాలా తక్కువ. వంక సాఫీగా వెళ్తే ఇంతటి ప్రమాదం ఉండేదికాదని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లు తెరవాల్సి ఉంది. వంక పొరంబోకులో వెలిసిన అక్రమ నిర్మాణాలు, గుడిసెలను తొలగించి పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. లేదంటే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.

జేసీతో విచారణ చేయిస్తాం

ఉప్పరపల్లి సమీపంలోని 194, 214, 215 సర్వే నంబర్లలో వెలిసిన వివిధ కాలనీల్లో వేసుకున్న గుడిసెలు, పక్కా ఇళ్లు వంక పొరంబోకు స్థలాల్లో వేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. వంక పొరంబోకు స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే ఎప్పటికైనా ప్రమాదమే. వరద ఉధృతి తగ్గిన తర్వాత ఆయా కాలనీల్లోని గుడిసెలకు మంజూరు చేసిన పట్టాలపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేయిస్తాం. వంక పొరంబోకు స్థలాల్లో ఏ ఒక్క గుడిసె ఉండకూడదు. అక్కడి పేదలందరికీ న్యాయం చేస్తాం. నకిలీ పట్టాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయిస్తాం. – కలెక్టర్ వినోద్‌కుమార్

పేదలకు న్యాయం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్: ఆక్రమణల కారణంగానే పండమేరు వంక సమీప కాలనీలు నీట మునిగాయని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహం ఎక్కువై సమీప ఇళ్లలోకి వెళ్లిందన్నారు. రాప్తాడు మండలం కళాకారులకాలనీ నుంచి అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి వరకు ఇష్టానుసారంగా వంక స్థలాన్ని ఆక్రమించుకున్నారని,సంఘాల పేరుతో నిరుపేదల నుంచి భారీగా వసూళ్లు చేసి రూ. కోట్లు గడించారన్నారు. ఫేక్ పట్టాలతో పేదలను మభ్య పెట్టారన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొందన్నారు. కలెక్టర్ స్పందించి దొంగ పట్టాలపై విచారణ జరిపించాలన్నారు. నకిలీ పట్టాలు పొంది మోసపోయిన ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రత్యామ్నాయంగా అవసరమైతే ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి పట్టాలివ్వాలన్నారు. ఒక్కొక్కరికీ రూ. 5 లక్షలు ఖర్చు చేసి ఇల్లు నిర్మించాలన్నారు. పండమేరు వంక హద్దులపై రీసర్వే చేయించి బౌండరీ రాళ్లు నాటించాలన్నారు. హద్దుల వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మించాలన్నారు. ట్యాంక్ బండ్ తరహా అభివృద్ధి చేసి పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం గతంలో ఆర్డీటీ సంస్థ ముందుకొచ్చిందని, వారితో పాటు దాతల సహకారంతో పండమేరు వంక వెంబడి అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవ తీసుకోవాలని కోరారు.



గురురవిదాస్ కాలనీలో వరదనీటితో తడిసిన బియ్యాన్ని ఆరబెడుతున్న మహిళ

బాధితులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

రాప్తాడు: వరద బాధితులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన కళాకారుల కాలనీ, బృందావన కాలనీ, దండోరా కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వారికి అవసరమైన ఆహార పొట్లాలు పంపిణీ చేయాలన్నారు. ఆయా కాలనీల్లోని బాధిత కుటుంబాల దగ్గరికి వెళ్లి, వరద వల్ల ఏమేమి నష్టపోయారో గుర్తించాలన్నారు. పరిహారం అందలేదంటూ ఏ ఒక్కరి నుంచి కూడా ఫిర్యాదు రాకూడదని స్పష్టం చేశారు. వరదల నష్టపోయిన వారి జాబితాను త్వరితగతిన తయారు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఆర్ఐ కరుణాకర్, సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సామాన్లు తీసుకుని బయటి ప్రాంతాలకు వెళ్తున్న కొట్టాలకాలనీవాసులు

రేపటి నుంచి పశుగణన

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకు పశుసంవర్ధకశాఖ పటిష్ట కార్యాచరణ రూపొందించింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో పశుగణన నిర్వహిస్తూ వస్తోంది. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, ఒంటెలు, కోళ్లు ఇలా అన్ని రకాల మూగజీవాల లెక్కింపు చేపడుతున్నారు. ఈ గణాంకాల ఆధారంగా పశుశాఖ ద్వారా పథక రూపకల్పన, పాడి రైతులు, జీవాల కాపర్ల సంక్షేమానికి ఆయా రాష్ట్రాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయి.

37 లక్షల మూగజీవాలు..

2019 పశుగణన ప్రకారం జిల్లా వ్యాప్తంగా 31 మండలాల పరిధిలో అన్ని రకాల మూగజీవాలు 37 లక్షలు ఉన్నాయి. అందులో పాడి ఆవులు, ఎద్దులు 2.16 లక్షలు, గేదెలు 1.90 లక్షలు, గొర్రెలు 22.94 లక్షలు, మేకలు 4.12 లక్షలు, పౌల్ట్రీ 5.27 లక్షలు, పందులు 8,164, కుక్కలు 45,815 ఉండగా, గాడిదలు, గుర్రాలు, ఇతరత్రా మూగజీవాలు ఉన్నట్లు వెల్లడైంది. ఆత్మకూరు, బొమ్మనహాళ్, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కుందుర్పి, ఉరవకొండ మండలాల్లో పాడి పశువులు, ఎద్దులు అధికంగా ఉండగా, బుక్కరాయసముద్రం, తాడిపత్రి, అనంతపురం మండలాల్లో గేదెలు, అనంతపురం, కళ్యాణదుర్గం,



కంబదూరు, కుందుర్పి,రాప్తాడు, ఉరవకొండ మండలాల్లో గొర్రెలు, డి.హీరేహాళ్, బ్రహ్మసముద్రం, ఆత్మకూరు మండలాల్లో మేకలు అధికంగా ఉన్నాయి.

పక్కాగా గణాంకాల సేకరణ..

పశుగణనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా గణాంకాలు సేకరించడానికి 242 మంది సిబ్బందిని నియమించినట్లు ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి తెలిపారు. ఇందులో 189 మంది ఎన్యూమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లు ఉండగా వీఏఎస్‌లు, ఏడీలు, డీడీలు పర్యవేక్షణ కొనసాగిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 6.18 లక్షల ఇళ్లకు వెళ్లి సమగ్ర వివరాలు సేకరిస్తారన్నారు. ఇప్పటికే పశుగణన సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. అయితే నోడల్ ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ వెంకటనాయుడు ఇటీవల ఎక్సైజ్ శాఖకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి తుది ముసాయిదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపనున్నట్లు తెలిపారు.

'ఈ స్టాంపింగ్'కు మంగళం!

- మళ్లీ నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు పచ్చజెండా
- అక్రమాలకు ఊతమిచ్చేలా సర్కారు నిర్ణయం



అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రక్షాళనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టింది. రిజిస్ట్రేషన్ శాఖలో మ్యాన్యువల్ విధానానికి స్వస్తి పలికి దశల వారీగా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే కార్డ్ ప్రైమ్ 2.0అనే సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసింది. స్టాంపుల అక్రమాలకు తావులేకుండా ఈ స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆస్తుల క్రయ విక్రయాల్లో గంటల కొద్దీ కార్యాలయాల్లో వేచి చూడాల్సిన అవసరం లేకుండా నిమిషాల వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేసి డాక్యుమెంట్లు సైతం వినియోగదారుల చేతికందేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాత తేదీలతో స్టాంపుల విక్రయాలు లేకుండా ఏ రోజుకు ఆ రోజే అనే విధంగా ఆన్‌లైన్ చేసింది.

మళ్లీ నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వైపు..

ఆన్‌లైన్ విధానానికి పోటీగా అడుగులు వేయాల్సిన సమయంలో కూటమి ప్రభుత్వం ఆ విధానానికి మంగళం పాడే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పాత తేదీలతో కొనుగోలు చేసేవారు. భూముల కొనుగోలు అగ్రిమెంట్లు సృష్టించుకొని పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడేవారు. దీన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అలాంటి నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు స్వస్తి పలికి ఈ స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టింది. వినియోగదారులు సైతం ఈ స్టాంపింగ్ విధానంలో స్టాంపుల కొనుగోలుకు అలవాటుపడ్డారు.



స్టాంపుల అక్రమాలకు తెరలేపినట్లే..

ప్రభుత్వం పాత పద్ధతిలోనే నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రవేశపెట్టాలని చూస్తుండటంతో స్టాంపుల అక్రమాలకు ఊతమిచ్చినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్టాంప్ వెండర్లకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు స్టాంపులు విక్రయిస్తారు. వారు పాత తేదీలతో వినియోగదారులకు అధిక ధరలకు స్టాంపులను విక్రయించి సొమ్ము చేసుకుంటారు. దీనికి తోడు పాత తేదీలతో స్టాంపులపై అగ్రిమెంట్లను సృష్టించుకుని భూ అక్రమాలకు పాల్పడే అవకాశం మెండుగా ఉంది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రభుత్వమే ప్రవేశపెడితే ప్రత్యక్షంగా అక్రమాలకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉంది.

ఇండెంట్ పంపాం



స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కోసం ఇండెంట్ పంపాం. నవంబర్ మొదటి వారంలోగా స్టాంపులు జిల్లాకు వస్తాయి. ప్రస్తుతానికి ఈ స్టాంపింగ్ విధానంలో కొనుగోలు చేసుకోవచ్చు. ఈ విధానాన్ని కొనసాగిస్తారా? రద్దు చేస్తారా? అనే విషయంపై సమాచారం లేదు. రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రవేశపెడుతున్నాం.
– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

తెగ తాగేస్తున్నారు!

- 7 రోజుల్లో 4 లక్షల లీటర్ల మద్యం అమ్మకం
- లిక్కర్ గోడౌన్ నుంచి రూ.57.51 కోట్ల విలువైన మద్యం సరఫరా
- బార్లలో జరుగుతున్న మద్యం వినియోగం అదనం
- బెల్టు షాపులు వస్తే రోజూ రూ.10 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతుందని అంచనా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు పుణ్యమా అని ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మద్యం కిక్కు బాగా ఎక్కింది. మద్యం అమ్మకాలకు డోర్లు బార్లా తెరవడం, ఎక్కడా నియంత్రణ లేకపోవడం, ఎమ్మెల్యేలే దగ్గరుండి మద్యం షాపుల నిర్వహణకు పూనుకోవడం తదితర కారణాలతో మద్యం వినియోగం భారీగా పెరిగింది. మరోవైపు బార్లలో వినియోగం ఎలాగూ ఉంది. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు రూ.3.50 కోట్ల మద్యం వ్యాపారం జరిగితే చాలా గొప్ప. ఇప్పుడది రమారమి రూ.5.5 కోట్లు దాటినట్టు తేలింది. ఓవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా స్పందించని కూటమి సర్కారు.. మరోవైపు మద్యం రేటు ఎంతున్నా తాగండి తాగండి అంటూ ఊరూరికీ మద్యం సరఫరా చేస్తూ ఆదాయం పెంచుకుంటుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పోలీసుల సహకారం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుడి,బడి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఎక్కడైనా ఎవరైనా వ్యతిరేకిస్తే టీడీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయి. పోలీసులు కూడా బాధితులపైనే రివర్స్ కేసులు పెడుతున్నారు. మద్యం నియంత్రణకు పాటుపడాల్సిన వారే ఇలా ఎమ్మెల్యేల ఆదాయానికి కాపలా కాస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అనంతపురం వన్‌టౌన్ సీఐ వ్యవహారమే ఇందుకు నిదర్శనం.

చీప్ లిక్కర్ వస్తే మరింతగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చీప్ లిక్కర్ అమ్మకాలు పెంచేందుకు సర్కారు చీప్ లిక్కర్‌ను బాగా ప్రమోట్ చేస్తోంది. రూ.99కే మద్యం అంటూ కార్పొరేట్ కంపెనీలు ప్రకటనలు ఇచ్చినట్టుగా టీడీపీ నేతలు చెబుతున్నారు. తాజాగా 22వ తేదీ 750 కేస్‌ల మద్యం వస్తే గంటలోనే అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి చీప్ లిక్కర్ కోసం జనం ఎలా ఎగబడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇకపోతే.. సర్కారు సరఫరా చేస్తున్న మద్యం నాణ్యతపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. హోటళ్లు, ధాబాలు, చిన్న రెస్ట్ రూములు, లాడ్జిల్లో మద్యపానం విచ్చలవిడి అయింది. భవిష్యత్తులో ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.10 కోట్ల విలువైన మద్యం వినియోగం జరిగినా ఆశ్చర్యం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 23వ తేదీ ఉదయం 11 గంటల సమయానికి లెక్కలు..

జిల్లాలో మద్యం షాపులు	136
ఇప్పటివరకూ ప్రారంభించినవి	127
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం షాపులు	87
ఇప్పటివరకు ప్రారంభించినవి	81
లిక్కర్ గోడౌన్‌నుంచి వెళ్లిన మద్యం	65,456 కేస్‌లు (5,89,104 లీటర్లు)
మద్యం విలువ	రూ.57,51,24,688
మద్యం షాపుల నుంచి వినియోగం	3,82,917.6 లీటర్లు
దీని విలువ	రూ.37,31,81,047
రెండు జిల్లాల్లో బీర్ల అమ్మకాలు	18,462 కేస్‌లు
బార్లలో జరుగుతున్న మద్యం	రూ.80 లక్షలు (రోజుకు)

సన్నద్ధంగా ఉండండి

- వర్షాల నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అన్నివిధాల సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వహణ అంశంపై బుధవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, మైనర్ ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి నివేదిక అందించాలని ఆర్డీఓలను ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు, దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హగరి, చిన్న హగరి, పెన్నా, చిత్రావతి, పండమేరు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని చెప్పారు. వర్షాల కారణంగా ఎక్కడా ప్రాణ, పశు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దెబ్బతిన్న రహదారులు, కాజ్‌వేలు మరమ్మతు చేయించాలన్నారు. విపత్తులను ఎదుర్కొని సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు.

క్లుప్తంగా

గుంతకల్లు బ్యూటీషియన్‌కు ఐకాన్ అవార్డు



హీరో విశాల్ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న లలిత

గుంతకల్లు: పట్టణానికి చెందిన బ్యూటీషియన్ లలితకు వరల్డ్ బ్యూటీ అస్తెటిక్ ఐకాన్ అవార్డు దక్కింది. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో చైన్నె వేదికగా డబ్ల్యూబీపీసీ ఆధ్వర్యంలో వరల్డ్ బ్యూటీ అస్తెటిక్ ఐకాన్ అవార్డు–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 21 దేశాలకు చెందిన బ్యూటీషియన్లు హాజరు కాగా, ఇందులో 30 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో గుంతకల్లుకు చెందిన లలితకు అవార్డు దక్కింది. సినీ హీరో విశాల్ చేతులు మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

వివాహిత బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడుకు చెందిన రేవతి(24), మురళి దంపతులకు రెండు నెలల వయసున్న కుమార్తెతో పాటు రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. బతుకు తెరువు కోసం కొన్నేళ్ల క్రితం కళ్యాణదుర్గానికి కుటుంబంతో కలసి వలస వచ్చిన మురళి... దొడగట్ట రోడ్డులోని మార్కెట్ యార్డ్ సమీపంలో అద్దె ఇంట్లో నివాసముంటూ చెక్కిలాలు, కారాలు, నిప్పట్ల తయారీతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కొన్ని రోజులుగా దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రేవతి... బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకొని ఇంటికి వచ్చిన మురళి తలుపులు ఎంత సేపటికీ తీయకపోవటంతో చుట్టు పక్కలవారి సాయంతో బద్ధలుగొట్టి లోపలకు వెళ్లి చూశాడు. ఉరికి వేలాడుతున్న రేవతిని దించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ నరసింహామూర్తి మృతి



నరసింహామూర్తి (ఫైల్)

అనంతపురం: అనంత పోలీస్ శాఖలో పేరుగాంచిన కంబదూరు నరసింహామూర్తి బుధవారం అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నిరుపేద ఎస్సీ కుటుంబంలో జన్మించిన ఆయన 1996లో పోలీసు శాఖలో చేరారు. మంచి ధైర్య సాహసాలతో ఎన్‌కౌంటర్ల స్పెషలిస్టుగా ఖ్యాతి గాంచారు. జిల్లాలో ఆయన పేరు తెలియని మావోయిస్టులు లేరు. ఉమ్మడి ఏపీ డీజీపీ నుంచి పలు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రస్తుతం పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఆయన అనంతపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

మట్కా డాన్ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

యల్లనూరు: మండలంలో కొడవండ్లపల్లికి చెందిన మట్కా డాన్ తిరుపతి నాయుడిని అరెస్ట్ చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. కొడవండ్లపల్లి గ్రామ పొలాల్లో మట్కా రాస్తున్నట్లుగా అందిన పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసులను గమనించి తిరుపతి నాయుడు అక్కడి నుంచి పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి, మట్కా పట్టీలు, రూ. 2,02,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- వంట పొలాలకు పురుగు మందులు తేవడానికి వెళుతుండగా ప్రమాదం
- కూతలేరు బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇసుక టిప్పరు
- అక్కడికక్కడే మృతి చెందిన ఇద్దరు స్నేహితులు
- సోదనపల్లిలో విషాదఛాయలు





మృతి చెందిన డ్రిప్పు అట్టె రమణ, పేట నాగేశ్వరరెడ్డి, నుజ్జు నుజ్జు అయిన బైక్

శింగనమల: ఎక్కడికైనా ఇద్దరూ కలిసి వెళ్తుంటారు. కష్ట సుఖాల్లో సహకరించుకుంటారు. చివరకు మృత్యువులోనూ స్నేహ బంధాన్ని మరువలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

మూడు దశాబ్దాల స్నేహం

శింగనమల మండలం సోదనపల్లి గ్రామానికి చెందిన అట్టె రమణ అలియాస్ డ్రిప్పు రమణ (50), పేట నాగేశ్వరరెడ్డి (53) మధ్య 30 ఏళ్ల క్రితం ఏర్పడిన స్నేహం అప్పటి నుంచి కొనసాగుతూ వచ్చింది. మంచి స్నేహితులుగా గ్రామంలో వీరికి పేరుంది. ఏ పనికైనా ఇద్దరూ కలిసి వెళ్లేవారు. ఇద్దరూ వ్యవసాయంతో జీవనం సాగిస్తూనే మరో వైపు జైన్ డ్రిప్పు కంపెనీలో పని పనిచేస్తున్నారు. ఎంతో అన్యోన్యంగా కలిసి తిరిగే వీరిని రామలక్ష్మణులుగా గ్రామస్తులు పిలిచేవారు.

కబళించిన ఇసుక టిప్పరు

శింగనమల మండల పరిధిలో కొంత కాలంగా జాతీయ రహదారి–244డీ పనులు కొనసాగుతున్నాయి. పనులకు సంబంధించి అవసరమైన ఇసుక, కంకర తరలింపులకు రేయింబవళ్లూ టిప్పర్లను వినియోగిస్తున్నారు. టిప్పరు డ్రైవర్లు రోడ్డు నిబంధనలు విస్మరించి అతి వేగంగా వాహనాలను నడుపుతుండడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు క్షతగాత్రులయ్యారు. కాగా, తాము సాగు చేసిన పంట పొలాలకు పురుగు మందులు కొనుగోలు చేసేందుకు డ్రిప్పు రమణ, నాగేశ్వరరెడ్డి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అనంతపురం–తాడిపత్రి మార్గంలో పోతురాజుకాల్వ వద్ద ఉన్న కూతలేరు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే వెనుకనే వేగంగా దూసుకొచ్చిన ఇసుక టిప్పరు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ టిప్పరును ఆపకుండా ముందుకు దూసుకెళ్లడంతో దాదాపు ఫర్లాంగ్ దూరం వరకూ ద్విచక్ర వాహనంతో పాటు రమణ, నాగేశ్వరరెడ్డిని ఈడ్చుకెళ్లింది. డ్రిప్పు రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పేట నాగేశ్వర్‌రెడ్డిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. డ్రిప్పు రమణకు 4 ఎకరాలు పొలం ఉంది. వేరుశనగ, చీనీ పంటలు సాగు చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పేట నాగేశ్వరరెడ్డికి 5 ఎకరాల పొలం ఉండగా, మునగ పంట సాగు చేశారు. ఆయనకూ భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సోదనపల్లిలో విషాదఛాయలు

ప్రమాదం జరిగిన ప్రాంతం సోదనపల్లికి 4 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విషయం వెంటనే గ్రామస్తులకు తెలిసిపోయింది. దీంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎంతో స్నేహంగా ఉన్న ఇద్దరినీ కబళించి ఎంత పనిచేశావయ్యా దేవుడా? అంటూ రోదించారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన టిప్పరును వదిలేసి డ్రైవర్ పరారైనట్లుగా గుర్తించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యాడికిలో పట్టపగలే హత్య

- వ్యసనాలకు బానిసైన తండ్రి
- ఆస్తి అన్యాక్రాంతం చేస్తాడనే ఆందోళనతో విచక్షణ కోల్పోయిన కుమారుడు



లక్ష్మీనారాయణ (ఫైల్)

యాడికి: వ్యసనాలకు బానిసై.. ఆస్తిని అన్యాక్రాంతం చేస్తాడనే ఆందోళనతో విచక్షణ కోల్పోయిన పెద్ద భార్య కుమారుడు చివరకు కన్న తండ్రినే దారుణంగా హత మార్చాడు. యాడికిలో పట్టపగలే ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం వీరన్నపల్లికి చెందిన వర్రా లక్ష్మీనారాయణ(50)కు 1999లో క్రిష్టిపాడుకు చెందిన వరలక్ష్మితో వివాహమైంది. 2000లో గర్భం దాల్చడంతో వరలక్ష్మి కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. ఆ సమయంలో భార్యను పిలుచుకొచ్చేందుకు వెళ్లిన లక్ష్మీనారాయణతో తాను ఇప్పట్లో రాలేనని, కాన్పు తర్వాత వస్తానని వరలక్ష్మి తెలిపింది. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. కుమారుడు పుట్టిన తర్వాత ఇద్దరూ విడిపోయారు. 2005లో తాడిపత్రి మండలం పెద్దపొలమడ గ్రామానికి చెందిన రమాదేవిని లక్ష్మీనారాయణ రెండో పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి పదేళ్ల వయసున్న రామయ్య అనే కుమారుడు ఉన్నాడు.

ఐదేళ్ల క్రితం విడిపోయిన రెండో భార్య

వ్యసనాలకు బానిసైన లక్ష్మీనారాయణ తన తీరు మార్చుకోకపోవడంతో ఐదేళ్ల నుంచి రెండో భార్య రమాదేవి కూడా భర్తకు దూరంగా ఉంటూ వస్తోంది. తన కుమారుడు రామయ్యతో కలసి పెద్ద పొడమలలో వ్యసాయ కూలి పనులతో ఆమె జీవనం సాగిస్తోంది. యాడికిలోని వెంగమనాయుడు కాలనీలో నివాసముంటున్న వరలక్ష్మి సైతం తన కుమారుడు 24 ఏళ్ల వయసున్న కుమారుడు కార్తీక్‌తో కలసి బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో వీరన్నపల్లిలో తాతల కాలం నుంచి సంక్రమించిన ఆరు ఎకరాల పొలంలో తన తల్లి వరలక్ష్మికి అందాల్సిన వాటాను పంపకం చేసి ఇవ్వాలంటూ తండ్రి లక్ష్మీనారాయణను కార్తీక్ ప్రాధేయపడుతూ వచ్చాడు.

గొంతు కోసి.. బండరాళ్లతో బాది..

తాగుడుకు బానిసైన లక్ష్మీనారాయణ జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో సంపాదన లేకపోవడంతో ఆస్తిని తమకు తెలియకుండానే ఇతరులకు విక్రయించి, ఆ సొమ్ముతో జల్సాలు చేస్తాడని అనుమానం పడిన కార్తీక్ పలుమార్లు ఆస్తి పంపకాలు చేసివ్వాలంటూ తండ్రిని కోరుతూ వచ్చాడు. అయినా లక్ష్మీనారాయణ ఆస్తి పంపకాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా మొండికేయడంతో సహనం కోల్పోయిన కార్తీక్... బుధవారం మధ్యాహ్నం యాడికిలోని అమ్మవారి శాల వెనుక వీధిలో నడుచుకుంటూ వెళుతున్న లక్ష్మీనారాయణతో ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన కార్తీక్ ఇటుకలు, బండరాళ్లతో దాడి చేశాడు. కిందపడిన లక్ష్మీనారాయణ గొంతును కత్తితో కోసి హతమార్చి నేరుగా పోలీసులకు లొంగిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న తన సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఇంటి వద్ద ఉన్న వరలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న పెద్దపొడమలలో ఉన్న రెండో భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగభృతి ఎక్కడ బాబూ?

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం చంద్రబాబు అమలు చేయడం లేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల్లో ఏడు సార్లు మంత్రి వర్గ సమావేశం జరిగినా... ఒక్కసారి కూడా నిరుద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదన్నారు. బుధవారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. నిరుద్యోగ భృతి అమలుకు విధివిధానాలు ఇప్పటి వరకూ ప్రకటించలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎప్పుడిస్తారో తెలియడం లేదన్నారు. మెగా డీఎస్సీ ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. ఎలాంటి అంక్షలు లేకుండా నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నాయకులు శ్రీనాథ్, ధనుంజయ, శ్రీనివాస్, సురేంద్ర పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



పెన్నార్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

అనంతపురం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకం డబ్బు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా పెన్నార్ భవన్ కార్యాలయం వద్ద బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంతురాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,100 కోట్లు, వసతి దీవెన పథకం కింద రూ.1,400 కోట్లను కూటమి సర్కార్ చెల్లించకుండా వేధిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఏటా విద్యార్థులకు నాలుగు విడతల్లో డబ్బు జమ అయ్యేదని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల కాకపోవడంతో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు వేధిస్తున్నాయన్నారు. బకాయి డబ్బు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామంటూ ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులనూ కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించిన వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శి మంజునాథ్, ఉమా మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ నాయకులు హరికృష్ణ, నాని, మన్సూర్, మంజునాథ, ప్రేమ్ , అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతగా చిత్తూరు, గుంటూరు


హిందూపురం టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముదిరెడ్డిపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ టోర్నీ విజేతగా చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయి. మూడు రోజులపాటు సాగిన ఈ పోటీలు బుధవారం ముగిశాయి. చివరి రోజు బుధవారం బాలుర విభాగం సెమీఫైనల్స్ జరిగాయి. ఇందులో విశాఖపై గుంటూరు, శ్రీకాకుళంపై చిత్తూరు జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. అనంతరం హోరీహోరీగా సాగిన ఫైనల్ పోటీలో గుంటూరుపై చిత్తూరు జట్టు గెలిచి మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో విశాఖ, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచాయి.

బాలికల విజేత గుంటూరు : బాలికల విభాగంలో అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, తొలి సెమీఫైనల్‌లో ప్రకాశంపై చిత్తూరు జట్టు, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై గుంటూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరుపై గుంటూరు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో అనంతపురం, నాల్గో స్థానంలో ప్రకాశం జట్లు నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, హెచ్‌ఎం సుధామణి, టోర్నీ అబ్జర్వర్ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మోరార్జీ యాదవ్, ముదిరెడ్డిపల్లి వాసులు మంజునాథ్, బాలాజీ, మంచాల మారుతి, పల్లా లక్ష్మీ కుమార్, ఏసీ నాగరాజు, ఓబులేసు, పామిశెట్టి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, పీఈటీలు రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

రాప్తాడు రూరల్: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ ఎన్.శేఖర్ వెల్లడించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన అగ్రహారం రంగస్వామి అలియాస్ రంగ పాత నేరస్తుడు. కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, డోన్, అనంతపురం జిల్లా గుత్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో అనంతపురం రూరల్ పీఎస్ పరిధిలోని సోములదొడ్డిలో జరిగిన దొంగతనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో అనంతపురంలోని బళ్లారి రోడ్డులో బుధవారం రంగస్వామిని అరెస్ట్ చేశారు. రూ. 8 లక్షలు విలువ చేసే 125 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు ఎన్.శేఖర్, ఇస్మాయిల్, ఎస్‌ఐ రాంబాబు, కానిస్టేబుళ్లు పాండవ, శివ, అంజనేయప్రసాద్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

'స్టాఫ్ నర్సు' ఎన్నికల్లో పద్మ ప్యానెల్ విజయం



విజయం సాధించిన ఆర్‌బీ పద్మ ప్యానెల్‌లోని సభ్యులు

అనంతపురం మెడికల్: ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ అనంతపురం శాఖ ఎన్నికల్లో ఆర్‌బీ పద్మ ప్యానెల్ విజయం సాధించింది. బుధవారం ఐఎంఏ హాల్‌లో స్టాఫ్‌నర్సు అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ఆర్‌బీ పద్మావతి, కె.చాముండేశ్వరి, సి.పద్మజ ప్యానెళ్లు పోటీ పడ్డాయి. అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన ఆర్‌బీ పద్మావతికి 128 ఓట్లు, ఉపాధ్యక్షురాలిగా భానులతకు 108, కార్యదర్శిగా పుష్పాల లతకు 115, కోశాధికారిగా సంధ్య అరుణకు 87, ఈసీ సభ్యులుగా బీసీ నారాయణస్వామి 134, వై శ్రీదేవి 132, జి.ఆదిత్య దేవి 120, సి.నాగమణి 111, కమతం అరుణకు 104 ఓట్లు పడ్డాయి. అనంతరం ఆర్‌బీ పద్మావతి ప్యానెల్‌కు డిక్లరేషన్ ఫారాన్ని కో ఆపరేటివ్ సొసైటీ శాఖ అధికారులు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శెట్టూరు : కరిడిపల్లి గ్రామ పొలాల్లో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.70,170 నగదు, 3 బైకులు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్, ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలోని సిద్ధరాంపురం గ్రామ శివారులోని కంపచెట్లలో బుధవారం సాయంత్రం పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.34,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ద్రాక్ష రైతుకు తీవ్ర నష్టం



హంపాపురం వద్ద నేలకొరిగిన ద్రాక్ష పంట

రాప్తాడు: భారీవర్షంతో హంపాపురంలో ద్రాక్ష రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి 2.50 ఎకరాల్లో ద్రాక్ష పంటను సాగు చేశాడు. పంట దిగుబడి 60 టన్నుల దాకా వచ్చే అవకాశం ఉండేది. వారం రోజుల్లో పంటను కోసి మార్కెట్‌కు తరలించాలని భావించాడు. అయితే..సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట మొత్తం నేలకూలింది. ఫలితంగా దాదాపు రూ.20 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఉద్యాన అధికారి రత్నకుమార్ పంటను పరిశీలించారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిహారం అందేలా చూస్తామన్నారు. గ్రామంలో ద్రాక్ష పంటను నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కేశవ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, తలారి సింగారప్ప, మరూరు వెంకటేష్ తదితరులు డిమాండ్ చేశారు. వారు నేలకొరిగిన పంటను పరిశీలించారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



మహిళను ఇంటర్వ్యూ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం సెంట్రల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశ ర్మ అధ్యక్షతన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. అనంతపురం అర్బన్, రూరల్, నార్పల, తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం ఏడు అంగన్‌వాడీ వర్కర్స్, నాలుగు మినీ అంగన్‌వాడీ వర్కర్స్, 38 హెల్పర్ పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 139 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడీపీఓలు లలిత, ధనలక్ష్మి, సాజిదా, ఉమాశంకరమ్మ, భారతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు హామీ నిలుపుకో బాబు'



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తామని చెప్పిన బాబు.. తన హామీని నిలుపుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, రాష్ట్ర మైనార్టీ చైర్మన్ దాదాగాంధీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ డక్ అవుట్ అయ్యాయని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం పని చేయడం లేదన్నారు. అమలు చేయలేని హామీలిచ్చి కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ప్రజలు చైతన్య వంతులై ఈ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు కొండారెడ్డి, శంకరయాదవ్, ఇమామ్, కవిత, పోలక్క పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వాటర్ హీటర్

- విద్యుదాఘాతంతో బాలిక మృతి



మృతి చెందిన శ్రీవల్లి

కనగానపల్లి: స్నానం చేసేందుకు హీటర్‌తో నీటిని వేడి చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ బాలిక విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రాచెర్లకు చెందిన నరసింహులు, నాగవల్లి దంపతుల కుమార్తె శ్రీవల్లి (9) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలిక.. స్నానం చేసేందుకు బాత్‌రూంలో ఉన్న వాటర్‌హీటర్ ఆన్ చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే గమనించిన కుటుంబీకులు బాలికను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

రైతన్నకు తీరని నష్టం

- భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు
- నీట మునిగిన వరి, వేరుశనగ
- తూతూమంత్రంగా పంటలను పరిశీలించిన అధికారులు



కనగానపల్లి వద్ద నేలవాలిన వరిని చూపుతున్న రైతు



ముక్తాపురం వద్ద దెబ్బతిన్న కంది



భారీ వర్షానికి మామిళ్లపల్లి వద్ద నేలకొరిగిన ఆముదం

కనగానపల్లి: గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రైతన్నలకు అపార నష్టం మిగిల్చాయి. కుండపోత వర్షానికి చాలా గ్రామాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కనగానపల్లి చెరువు కట్ట తెగిపోయింది. నీరంతా ఆయకట్టు కింద ఉన్న వరి మళ్లపై ప్రవహించటంతో పంటంతా నేలకొరింది. కనగానపల్లిలోని 15 మంది రైతులు దాదాపు 50 ఎకరాల్లో సాగు చేసిన వరి దెబ్బతింది. దీంతో సుమారు రూ.కోటి దాకా పంట నష్టం సంభవించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ముక్తాపురం గ్రామంలోని చెరువు ఒకేసారి నిండి పెద్ద మరవ పారడంతో ఆయకట్టు కింద ఉన్న వరి మళ్లు, కాయగూరల పంటలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంకు నీటి మునగటంతో రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. అలాగే మామిళ్లపల్లి, కుర్లపల్లి, దాదులూరు, కనగానపల్లి, కోనాపురం, యలకుంట్ల గ్రామాల్లో మెట్ట భూముల్లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలు నాశనమయ్యాయి.

1,000 ఎకరాలకు పైగా పంటల నష్టం..

భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పంట నష్టం భారీగా సంభవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు తూతూమంత్రంగా పర్యటించిపోతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు ఎక్కడా పంట నష్ట వివరాలు అడగటం లేదని కనగానపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లోని రైతులు తెలిపారు. మండలంలో ఎప్పుడూ లేనంతగా 198 మి.మీ వర్షపాతం నమోదైంది. 1,000 ఎకరాలకు పైగా పంటలు దెబ్బతింటే అధికారులు కొన్నిచోట్ల మాత్రం పంటలు పరిశీలించారు. కేవలం 190 ఎకరాలు మాత్రమే దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిసింది. దీనివల్ల పంటలు నష్టపోయిన రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రాజకీయాలకు అతీతంగా పంట నష్టపరిహారాన్ని అందించాలని రైతులు కోరుతున్నారు.

వరి దెబ్బతింది



ముక్తాపురం చెరువు ఆయకట్టు కింద 3 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మరో 15 రోజుల్లో పంట కోతలు ప్రారంభించాల్సి ఉంది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు నిండిపోయింది. మరువ నీటితో పాటు వంక నీరు పంటలపై ప్రవహించడంతో పైరంతా నేలకొరిగింది. దీనివల్ల సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లింది. పంటలు ఈస్థాయిలో దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించ లేదు.

– వరప్రసాద్ రెడ్డి, రైతు, ముక్తాపురం

రూ.లక్ష నష్టం



భారీ వర్షాలకు 2 ఎకరాల్లో టమాట, 3 ఎకరాల్లో అనప పంటలు దెబ్బతిన్నాయి. వరద నీటికి పంటంతా కొట్టుకొని పోవడంతో సుమారు రూ.లక్ష దాకా నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పంట నష్టం గురించి చెబితే ఈ–క్రాప్ బుకింగ్ ఉంటేనే నష్ట పరిహారం వస్తుందటున్నారు. కాని రబీలో సాగు చేసిన పంటలకు అప్పుడే ఎలా క్రాప్ బుకింగ్ చేసుకుంటాం. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేయాలి.

– మహేష్, రైతు ముక్తాపురం గ్రామం

ఫైనల్‌కు దూసుకెళ్లిన ఒడిశా



ఒడిశా క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: రాజమాత జిజాబాయి ట్రోఫీ–2024 సీనియర్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ జోనల్ రౌండ్ పోటీలు బుధవారం ముగిశాయి. దేశ వ్యాప్తంగా 8 జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆర్డీటీ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌పై 0–2 గోల్స్ తేడాతో ఒడిశా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. కాగా, ఫైనల్ మ్యాచ్ ఎక్కడ జరుగుతుందనేది త్వరలో షెడ్యూల్ ఖరారు కానుంది. ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, కస్తూరికాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ ప్రహ్లాద, సెక్రెటరీ డాక్టర్ సుదర్శన్, ఏడీఎఫ్ఏ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాజమాత జిజాబాయి టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో‌ఫెర్రర్‌కు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ అభినందనలు తెలిపారు.

తొలిసారిగా సంతోష్ ట్రోఫీ

ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన సంతోష్ ట్రోఫీ మ్యాచ్‌లను దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే అవకాశం దక్కింది. ఇందుకు అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం వేదిక కానుంది. నవంబర్‌లో టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ ప్రెసిడెంట్, సెక్రెటరీ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రెటరీ హాజరుకానున్నారు.

కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదన



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 36వ డివిజన్ శ్రీనగర్ కాలనీలోని పాత పార్క్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. వర్షాలకు పార్క్ ప్రహరీ కూలిపోయిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి మేయర్ వసీం దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి మేయర్ పార్క్‌ను పరిశీలించారు. త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాకింగ్ ట్రాక్ తదితర వాటిని పరిశీలించారు. పార్క్‌లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసులు, ఈఈ రాధాకృష్ణ, డీఈ సుభాష్ చంద్రబోస్, కార్పొరేటర్ కమల్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



సూచనలిస్తున్న ఆత్మ పీడీ మద్దిలేటి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: కంది పంటను కాపాడుకుంటే మంచి దిగుబడులు వస్తాయని ఆత్మ పీడీ మద్దిలేటి తెలిపారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం ఏఓ జే.శశికళతో కలిసి రూరల్ మండలం చియ్యేడు, పూలకుంట రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వేరుశనగ, కంది పొలాలను పరిశీలించారు. వర్షాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం కంది బాగుందన్నారు. అయితే మరూకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు ఆశించి దెబ్బతీసే పరిస్థితి ఉన్నందున సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు మురళీక్రిష్ణ, అలేఖ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన తప్పనిసరి

ఆత్మకూరు: పంటల సాగుపై రైతులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలియజేశారు. బుధవారం మండలంలోని మదిగుబ్బ, తోపుదుర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగు, తెగుళ్లకు పిచికారీ చేసే మందులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పంటలు తొలగించే ముందు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు రూరల్: వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని పలువురు బాధితులకు ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీకి చర్యలు తీసుకుంది. బుధవారం సాయంత్రం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ చేతుల మీదుగా బాధితులకు సరుకులను అందజేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిబేడలు, లీటర్ పామాయిల్, రెండు కిలోల ఎర్రగడ్డలు, రెండు కిలోల బంగాళాదుంపలు అందజేశారు. మొత్తం 350 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తక్షణసాయంగా నిత్యావసర సరుకులను అందజేస్తున్నామన్నారు. అంచనాలు తయారు చేసి త్వరలోనే ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తుందన్నారు. వరద బాధితులెవరూ ఆందోళన చెందొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ మోహన్‌కుమార్, వీఆర్ఓ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

122 మందికి వినికిడి లోపం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో బుధవారం దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ వినికిడి లోప నిర్మూలన కార్యక్రమం–నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. 122 మందికి వినికిడి సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. 0–19 ఏళ్ల వయసు కలిగిన 126 మంది క్యాంపుకు హాజరయ్యారన్నారు. కాగా అందులో 114 మంది పిల్లలు, 8 మంది పెద్దలకు వినికిడి సమస్య ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. త్వరలో వీరికి వినికిడి పరికరాలను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రాజేష్, దీన్ దయాల్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ రామాంజనేయులు, కో–ఆర్డినేటర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.





వరదలో చేపల వేట

రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనంతపురం నగర శివారులోని ప్రధాన వాగు పండమేరు వరదతో పోటెత్తిన విషయం తెలిసిందే. బుధవారం వరద ఉధృతి తగ్గడంతో స్థానికులు చేపల వేటకు దిగారు. పై ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు తెగడంతో అందులో ఉన్న చేపలు వస్తుండటంతో కాలనీవాసులు ఉత్సాహంగా వలలతో చేపలు పట్టారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

రైతులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. భారీ వర్షానికి జిల్లాలో వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, అరటి, చీని, మిరప, దానిమ్మ, తదితర పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం కాకుండా ప్రభుత్వం ప్రకటించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా షరతుల లేకుండా పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దెబ్బతిన్న పంటలను తొలగించి మళ్లీ పంట సాగు చేసుకునేందుకు రైతులకు ప్రభుత్వం సహాయం అందించాలన్నారు. అదే విధంగా 2023 ఖరీఫ్, రబీలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా ప్రకటించాలన్నారు. జిల్లాలోని చెరువులను మరమ్మతు చేయించాలన్నారు. చెరువులు, కాలువలు, వంక స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలువల్లో వ్యర్థాలు వేయొద్దు

అనంతపురం కార్పొరేషన్: కాలువల్లో వ్యర్థాలు వేయవద్దని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ నగర ప్రజలకు సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య మెరుగు పనులను పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్ పేపర్లు, డబ్బాలు ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. కాలువల్లో చెత్తచెదారాన్ని వేయడం ద్వారా కాలువలు బ్లాక్ అయ్యి మురుగు రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చెత్తను నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలన్నారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు

అనంతపురం సెంట్రల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ జగదీష్ ఆదేశాలతో బుధవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించారు. 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసుల సేవలు, దైనందిన విధులు, త్యాగాలపై అవగాహన కల్పించారు. గెలుపొందిన విజేతలకు త్వరలో బహుమతులు అందజేయడం జరుగుతుందని వివరించారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎస్పీ జగదీష్

అనంతపురం: రక్తదానం చేయడం అంటే పునర్జన్మ కల్పించడమేనని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, కదిరి ప్రాంతాల నుంచి యువత స్వచ్ఛందంగా పాల్గొని 100 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ భద్రత, రక్షణ క్రమంలో పోలీసులు ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. అమరవీరుల సేవలు, త్యాగాలు స్మరించుకుంటూ వారోత్సవాలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టి పోలీసుల సేవలు, త్యాగాలు, దైనందిన విధులను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్, ఎస్ఐ విజయకుమార్, జీజీహెచ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పండమేరు వంతెనపై రాకపోకలు బంద్



పాత బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం/టవర్‌క్లాక్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు పొంగిపొర్లడంతో అనంతపురం రాప్తాడు మధ్య ఉన్న పండమేరుపై పాత బ్రిడ్జి ఊగుతోందని, దీనిపై రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఎన్‌హెచ్ఏఐ ఎస్ఈ హరిప్రసాద్, ఈఈ సుధాకర్‌రెడ్డి తదితరులు పండమేరు పాతబ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం వంతెన పై రాకపోకలను నిలిపివేశారు. ఎస్ఈ హరిప్రసాద్ మాట్లాడుతూ... రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో 2006లో నిర్మించిన ఈ బ్రిడ్జి వంక ఉధృతికి ఊగుతోందన్నారు. త్వరలో మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం డీఎస్పీ వి.శ్రీనివాసరావును కలసి పాత బ్రిడ్జిపై రాకపోకలు సాగించకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాత బ్రిడ్జి పక్కనే ఉన్న కొత్త బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేలా డీఎస్పీ శ్రీనివాసరావు చర్యలు తీసుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



డీటీ చెన్నకేశవులుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాప్తాడు: పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వంశీ డిమాండ్ చేశారు. బుధవారం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ డీటీ చెన్నకేశవులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, వసతి దీవెన రూ.1,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. గత సంవత్సరం పెండింగ్‌లో ఉన్న ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల యజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వమని కోర్సు పూర్తయిన విద్యార్థులను ఇబ్బందులుకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యకార్యదర్శి ఉమామహేశ్, నాయకులు హరి, మంజు పాల్గొన్నారు.

పండమేరు వంకలో పూజలు

రాప్తాడు: నియోజకవర్గంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. 30 ఏళ్ల తర్వాత పండమేరు వంకకు జలకళ వచ్చింది. కర్ణాటక, రామగిరి, కనగానపల్లి మండలాల్లో నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పరిసర గ్రామాల మహిళలు పండమేరు వంక దగ్గరకు వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాప్తాడుకు చెందిన మహిళలు జేఎన్‌టీయూ రోడ్డు దగ్గరికి వెళ్లి పూజలు చేపట్టారు.